క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ పట్నాయక్ భేటీ అయ్యారు. కడప జిల్లా పులివెందులలో కలిసి పలు అంశాలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ముందుగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి స్వర్గీయ రాజశేఖరరెడ్డికి నివాళులర్పించారు. - పెందుర్తి

వెంకన్న ఆలయంలో విశేష హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వేదికపై చక్రపెరుమాళ్లను అధిష్టింపజేసి హోమగుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఈఈ రాంబాబు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం పూజలు, అభిషేకాలు విశేషంగా జరిగాయి. తెల్లవారు జామున 5గంటల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామికి పూజలు చేశారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ వెల్‌నెస్ సెంటర్‌కు ఈవోఐ విడుదల



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఉక్కు స్టేడియం ఆవరణలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. సుమారు 5 వేల చదరపు అడుగులు కలిగిన ఆర్‌సీసీ బిల్డింగ్ ప్రాంగణాన్ని 10 ఏళ్ల పాటు అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను జూలై 6 వరకు స్టీల్ ప్లాంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. దరఖాస్తుకు జూలై 13ను ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఆసక్తి గల వ్యక్తులు, పార్టీలు గడువు వ్యవధిలోగా తమ దరఖాస్తులు అందజేయాలని తెలియజేశారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఉప్పుటేరులో చేపలు మృత్యువాత

- రసాయన వ్యర్థాలే కారణమని మత్స్యకారుల ఆందోళన
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన నాయకులు
- మత్స్యకారులకు న్యాయం చేయాలని డిమాండ్



మరణించిన చేపలు చూపిస్తున్న మత్స్యకారులు



మృత్యువాత పడిన చేపలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో మత్స్య సంపద మృత్యువాత పడింది. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ శుద్ధి చేయకుండా రసాయనాలు విడుదల చేయడం వల్లే చేపలు చనిపోయాయని మత్స్యకారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పలు పార్టీ నాయకులు ఉప్పుటేరును సందర్శించారు. ఉప్పుటేరు పై ఆధారపడి ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలరిపేట, తిక్కవానిపాలెం గ్రామాలకు చెందిన 12 వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారని.. వారికి న్యాయం చేయాలని జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఫార్మా, ఎన్టీపీసీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా రసాయన వ్యర్థాలు విడిచిపెట్టడడం వల్ల తరచూ ఇలాంటి అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మత్స్యకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉప్పుటేరును సందర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, మాజీ ఎంపీటీసీ అమ్మోరు, ఎంపీటీసీ మైలపల్లి అప్పన్న, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

- ఫార్మా, ఎన్టీపీసీ యాజమాన్యాలు విడిచిపెడుతున్న రసాయన వ్యర్థ జలాల కారణంగా ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో మత్స్య సంపదకు తీరని నష్టం జరుగుతుందని మత్స్యకార గ్రామ పెద్దలు చింతకాయల హనుమంతు, మైలపల్లి మహేష్ ఆరోపించారు. ఫార్మా పరిశ్రమలు, ఎన్టీపీసీ నుంచి వ్యర్థ రసాయనాలు ఉప్పుటేరులో యథేచ్ఛగా విడిచిపెట్టడడంతో మంగళవారం ఉప్పుటేరులో చిరు చేపలు, రొయ్యలు, పీతలు మృత్యువాత పడ్డాయన్నారు. ఇటువంటి చర్యలు జరగకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని గ్రామ పెద్దలు హనుమంతు, మహేష్, సూరాడ అమ్మోరు డిమాండ్ చేశారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ముత్యాలమ్మపాలెం ఉప్పుటేరులో చేపల మృత్యువాత పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుద్ధి చేయని వ్యర్థ రసాయనాలను ఉప్పుటేరులో విడిచిపెట్టడడం వల్లే ఈ విధంగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలో ని వేదికపై ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

డీఎస్పీ సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: దేశపాత్రునిపాలెంలో ఓ దళిత మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఇద్దరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని మంగళవారం రిమాండ్‌కు తరలించామని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ చెప్పారు. పరవాడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. దళిత మహిళ యశోదపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీకి చెందిన కంపర సత్యనారాయణ, ఆయన కుమార్తె భారతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీకి చెందిన మట్ట యశోదకు 2010లో కొణతాల నూకరాజుతో ప్రేమ వివాహం అయింది. వారికి ఓ కుమార్తె ఉంది. కాగా 2016లో నూకరాజు మరణించాడు. అనంతరం 2017లో కంపర రమేష్ అనే వ్యక్తితో యశోదకు ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. వివాహం కాకుండా ఇరువురు కొంత కాలం సహజీవనం చేశారు. అయితే తనను వివాహం చేసుకోవాలని యశోద రమేష్‌పై ఒత్తిడి తేవడంతో రమేష్ నిరాకరించాడు. దీంతో యశోద 2022లో ప్రేమ పేరుతో మోసం చేశాడని పేర్కొంటూ రమేష్‌పై పరవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసులో రమేష్ కొంత కాలం రిమాండ్‌లో ఉన్నాడు. అనంతరం బయటకు వచ్చాడు. రమేష్ మళ్లీ 6 నెలల నుంచి యశోదతో సహజీవనం చేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో యశోద గర్భం దాల్చింది. యశోదతో కలిసి ఉండడం రమేష్ తండ్రి కంపర సత్యనారాయణ, అతని చెల్లి భారతికి ఇష్టం లేదు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టు సమీపంలో రమేష్, యశోద మాట్లాడుకొంటుండగా అతని చెల్లి భారతి చూసి యశోదతో ఘర్షణకు దిగింది. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న రమేష్ తండ్రి సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని యశోదపై దాడికి పాల్పడ్డాడు. అతని వద్ద ఉన్న కూరగాయల కత్తితో యశోద మెడ, చేతులు, జబ్బపై గాయపర్చాడు. గాయపడిన యశోదను చికిత్స కోసం స్థానికులు గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. యశోద ఫిర్యాదు మేరకు కంపర సత్యనారాయణ, ఆయన కుమార్తె ఎస్.భారతిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ సత్యనారాయణ చెప్పారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న సురేష్ దంపతులు

సబ్బవరం: మండలంలోని లగిశెట్టిపాలెంలో దుర్గాలమ్మ అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు.మహిళలు పసుపు కుంకుమలు,చీరలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలిశెట్టి సురేష్ దంపతులతో పాటు గ్రామ సర్పంచ్ పాలిశెట్టి పార్వతి తదితరులు దర్శించుకున్నారు. గ్రామంలో రాత్రికి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మంచినీటి సరఫరాకు చర్యలు

అనకాపల్లి జెడ్సీ అయ్యప్పనాయుడు



తాడి గ్రామ పెద్దలతో మాట్లాడుతన్న అనకాపల్లి జెడ్సీ అయ్యప్పనాయుడు

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలకు సురక్షిత మంచినీరు సరఫరా చేయడానికి అవసరమైన చర్యలను తీసుకొంటామని అనకాపల్లి జోనల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు చెప్పారు. ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల మేరకు తాడి గ్రామంలో జీవీఎంసీ, పీసీబీ అధికారులు మంగళవారం పర్యటించారు. గ్రామ ప్రజలకు సురక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. రక్షిత మంచినీటి ట్యాంకును పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. గ్రామంలో తాగునీరు కలుషితమైన కారణంగా బయట నుంచి మంచినీరు తీసుకువచ్చి ప్రజలకు సరఫరా చేస్తామని కమిషనర్ అయ్యప్పనాయుడు చెప్పారు. తాగునీటితో పాటు గ్రామంలో మెడికల్ క్యాంపులు, కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు అధికారులను కోరారు. మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, కె.పైడిరాజు ఉన్నారు.

రైళ్లు పునరుద్ధరించాలని ఆందోళన



పరవాడలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: విశాఖ-విజయవాడ మీదుగా నడిచే రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఎం నాయకురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. రైళ్ల రద్దుపై పరవాడలో సీపీఎం నాయకులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. రైళ్లను రద్దు చేయడం వల్ల పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వలస కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. సామాన్య ప్రజలు గమ్యస్థానాలకు చేరుకోవడానికి నానా అవస్థలు ఎదుర్కొంటారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని రైళ్లను పునరుద్ధరించి సామాన్యులకు ప్రయాణ సౌకర్యం కల్పించాలని మాణిక్యం డిమాండ్ చేశారు. నాయకులు తులసిరాజు, నాయుడుబాబు, అప్పారావు, జగన్నాథరావు, శ్రీను పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిపిస్తున్న వేద పండితులు

అక్కిరెడ్డిపాలెం: భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా జరిపించారు. నాతయ్యపాలెం జాతీయ రహదారి పక్కనున్న శ్రీనివాస కల్యాణ మండపంలో శ్రీహరి సేవా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పి.రంగనాథాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేదిక అధినేత టి.సుధాకర్ రెడ్డి, రామనిర్మల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యానం ఆకట్టుకుంది. భక్తి సంగీత సేవా సంస్థ శృతిలయ అధ్యక్షుడు వి.ప్రభాకర్ బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. విశాఖ నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన 2 వేల మంది శ్రీహరి సేవకులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీహెచ్.వి.సత్యనారాయణ, ఎం.ఎస్. మాధవ్, కొణతాల రాజు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సువాసిని పూజ



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి



సువాసిని పూజలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం సువాసినీ పూజ నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ ఆచరించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి సమక్షంలో పండితుల వేదమంత్రాల మధ్య ఈ పూజను శాస్త్రోక్తంగా చేశారు. పీఠం దర్బారు హాల్లో లలితాదేవిని పూలదండలతో అలంకరించారు. ముందుగా సామూహిక లలిత సహస్ర పారాయణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొని భక్తులను ఆశీర్వదించారు. మీగడ రామలింగస్వామి బృందం సభ్యులతో బుధవారం సాయంత్రం 6 గంటలకు లలితా పీఠంలో 'భక్తసత్కీర'నాటకం ప్రదర్శన జరుగుతుందని పీఠం మేనేజర్ కృష్ణసేన్ తెలిపారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం



మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనాయుడు

పెదగంట్యాడ: మాదకద్రవ్యాలతో అన్నీ అనర్థాలేనని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మీనాయుడు అన్నారు. వాటికి అలవాటు పడి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దని హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లను దరి చేరనీయవద్దని, చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నా, విక్రయించినా వెంటనే 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రమ్యశ్రీ , పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలిన చెట్టుకు పునరుజ్జీవం

కేజీహెచ్‌లో అరుదైన ఘటన



పొక్లెయిన్ సహాయంతో చెట్టును యథాస్థానంలో నిలబెడుతున్న దృశ్యం



చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంట్ చేస్తున్న నిపుణులు



తిరిగిన నాటిన తర్వాత ఠీవిగా నిల్చున్న బాదం చెట్టు

మహారాణిపేట: ఇటీవల కురిసిన వర్షాలకు కేజీహెచ్‌లో నెలకొరిగిన మహా వృక్షానికిమంగళవారం పునర్జీవం కల్పించారు. ఆస్పత్రిలోని పార్కింగ్ ఆవరణలో గల 25 అడుగుల ఎత్తున్న బాదం చెట్టు వేళ్లతో సహా నేలకొరిగింది. అలా పడిన చెట్టును నరికేయకుండా తిరిగి యథాతథంగా నిలబెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పదుగురికీ ఉపయోగపడే ఆ చెట్టును నరికి పడేయకుండా తిరిగి నిలబెట్టేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చర్యలు చేపట్టారు. ఆ చెట్టులో కొన్ని కొమ్మలు తొలగించి, చెట్టు మానులో కూడా కొంత భాగాన్ని తొలగించి ఫంగల్ చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన క్లైమేట్ ఫ్రంట్ అనే సంస్థ సహకారం తీసుకున్నారు. జేసీబీ సహాయంతో చెట్టు పడిన ప్రాంతానికి 50 మీటర్ల దూరంలోని వేరే స్థలంలో తిరిగి నాటారు. వర్షాలకు పడిపోయిన చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంటు చేయటం వల్ల చెట్టు చిగురించి బతుకుందని క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి భట్టాచార్య తెలిపారు. గతంలో కాకినాడలో ఓఎస్‌టీఎస్ అనే సంస్థ ద్వారా అక్కడి వైద్య కళాశాలలో కూడా పడిపోయిన చెట్టును తిరిగి పునర్జీవింపజేసినట్లు కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కేజీహెచ్ ఏఆర్‌ఎంవో డాక్టర్ దవళ భాస్కర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు లోకనాథ్, మేనేజర్ జె.ఎం.జవహర్ తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ స్టాక్ యార్డుల అమ్మకాన్ని విరమించుకోవాలి'

ఉక్కునగరం: దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్ స్టాక్ యార్డ్‌ల అమ్మకాలను విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్లాంట్ ప్రారంభ సమయంలో ఉక్కు ఉత్పత్తుల అమ్మకం, నిల్వ కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, ఢిల్లీ, పూణే తదితర ప్రధాన నగరాల్లో యార్డులను కొనుగోలు చేశారన్నారు. కీలకమైన ప్రాంతాల్లో స్టాక్ యార్డులు ఉండటం వల్ల టాటా, జిందాల్ వంటి సంస్థలతో పోటీ పడుతున్నామని చెప్పారు. స్టాక్ యార్డ్‌లను అమ్మడం అంటే ప్లాంట్ ఉత్పత్తులకు ఉన్న గిరాకీని కోల్పోవడమే అని, తద్వారా ఉన్న మార్కెట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడమే అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మార్కెటింగ్ యార్డ్‌లను రూ.476 కోట్లకు అమ్మాలనే నిర్ణయాన్ని స్టీల్ సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. తక్షణం ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు.

షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నేడు

మురళీనగర్: హిందుస్థాన్ షిప్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం మాధవధార మున్సిపల్ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించనున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు దాటిన 15 మంది సభ్యులను సూపర్ హీరోస్ టైటిల్‌తో సత్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వై.అప్పారావు పర్యవేక్షణలో వినోద కార్యక్రమాలు ఉంటాయని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలి



ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న శ్యామ్‌ప్రసాద్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ కోరారు. మంగళవారం ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.సీతామాణిక్యంను కార్యాలయంలో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం నుంచి ఏయూలో ఈ కోర్సుల నిర్వహణ జరుగుతోందని, వీటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడానికి ఈ కోర్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీబీసీ యోగా చిత్ర ప్రదర్శన

మహారాణిపేట: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న చిత్ర ప్రదర్శన మంగళవారం ముగిసింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. యోగాసనాలు, యోగా ప్రక్రియలు, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ చిత్ర ప్రదర్శనను తిలకించడానికి బీచ్‌కు వచ్చిన సందర్శకులు ఆసక్తి చూపారు. వివిధ కళాశాలలు, పాఠశాలల్లో యోగాపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.